క్లుప్తంగా

764 పొగాకు బేళ్లు కొనుగోలు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శనివారం జరిగిన వేలంలో 764 పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుకొలు చేశారు. కారుమంచి క్లస్టరు గ్రామాలకు చెందిన రైతులు 839 బేళ్లను వేలాని తీసుకురాగా వాటిలో 764 కొనుగోలు జరిగగా, 75 బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 330 పలకగా, కనిష్ట ధర రూ. 205 పలికింది. సరాసరి రూ. 273. 37 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 40 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

మోదీ ప్రమాణస్వీకారానికి రిటైర్డ్ హెచ్ఎంకు ఆహ్వానం

గిద్దలూరు రూరల్: భారత ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ ఈ నెల 9వ తేదీన ప్రమాణస్వీకారం చేయబోతున్న సందర్భంగా ఆయన ప్రమాణస్వీకార మహోత్సవానికి గిద్దలూరుకు చెందిన మార్కాపురం రాంభూపాల్‌రెడ్డి అనే రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడికి ఆహ్వానం అందింది. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ మెసేజ్ వచ్చినట్లు రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రమాణస్వీకర మహోత్సవానికి వెళ్లేందుకు పత్రాలన్నీ సిద్ధం చేసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో వేణుగోపాల స్వామి

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామికి శనివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 7 గంటలకు స్వామివారిని వివిధరకాల పూలతో అలంకరించి పంచామృతాభిషేకం, అష్టోత్తరపూజలు నిర్వహించారు. తర్లుపాడులోని పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పంట మార్పిడి.. ప్రయోజనాలెన్నో..!

- తెగుళ్ల నివారణ, అధిక దిగుబడులకు అవకాశం
- ఒకే పంట సాగుచేస్తే చీడపీడల ఉధృతి అధికం
- పంట మార్పిడితో భూమిలో సేంద్రియ పదార్థాల వృద్ధి



పంటల సాగుకోసం పొలం దున్ని సిద్ధంచేస్తున్న రైతు

పామూరు: ఏటా ఒకే పంట సాగు చేస్తే రైతులకు పెట్టుబడులతో పాటు తెగుళ్ల ఉధృతి, దిగుబడులు తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏటా పంట మార్పిడి విధానాన్ని అనుసరిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఒకేరకం పంటను ఏళ్ల తరబడి సాగుచేయడం ద్వారా దిగుబడులు తగ్గుతాయని, సాగుచేసిన పంటల్లో ఎదుగుదల ఉండదని, చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుందని, అందుకే పంటమార్పిడి చేయాలని వ్యవసాయశాఖ అధికారులు రైతన్నలకు సూచిస్తున్నారు. పొలంలో ఒకేరకం కాకుండా వేర్వేరు పంటలను ఒక క్రమంలో సాగు చేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. పంటమార్పిడి చేయడం ద్వారా ప్రకృతి వనరులను సైతం సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని, తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బంది లేకుండా అధిక లాభం పొందవచ్చన్నారు. ప్రస్తుతం రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పంటమార్పిడి ఆవశ్యకతపై పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలను గుర్తించి ఆచరించాలని పేర్కొంటున్నారు.

ఒకే తరహా పంటలతో నష్టాలు..

- ఏటా ఒకేరకం పంట సాగుచేయడం వల్ల చీడపీడలు, కలుపు బెడద అధికంగా ఉంటుందన్నారు. సాగుచేసిన పైరుకూడా ఎదుగుదల లేక తద్వారా దిగుబడులు తగ్గుతాయి. దీంతో రైతులకు పెట్టుబడి భారం పెరిగి నష్టం వాటిల్లుతుంది.
- ఒకేపంట సాగుతో వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల నేలలో ఆ లోతు వరకు ఉన్న పోషకాలను మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి.
- నేలకోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యతగా ఉండదు. ఫలితంగా గిట్టుబాటుధర లభించదు. దీంతో రైతులకు నష్టంవచ్చే అవకాశం ఉంది. మార్కెట్ సమస్యలుకూడా ఎదురవుతాయి. అందుకే వేర్వేరు పంటలను సాగుచేసుకోవాలి.
- ఎక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు, తక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు ఒకదా తరువాత ఒకటి సాగుచేయాలి. ఉదాహరణకు జొన్న, పత్తి.
- సారాన్ని అభివృద్ధిచేసే పంటలను ఒకదానితరువాత ఒకటి సాగుచేసుకోవాలి.

పంట మార్పిడితో భూసారం వృద్ధి

- వరిపంట సాగుచేసే ముందు పచ్చి రొట్టపైర్లు సాగుచేయడం వల్ల భూసారం పెరిగి సేంద్రీయ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండటంవల్ల పైరు ఏపుగా పెరుగుతుంది.
- వరి తరువాత అపరాలు లాంటి పైర్లు సాగుచేయడంవల్ల భూమిలో సేంద్రీయ పదార్థం అధికమవుతుంది. దీంతో పంటపై వచ్చే శిలీంద్రాల ఉధృతి తగ్గుతుంది.
- వరి తరువాత గింజ జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ వంటివి సాగుచేయడంవల్ల వాటి వేర్లలోని రైజోబియన్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటుంది. వేర్లలో బుడిపెల మాదిరిగా ఏర్పడి తర్వాత సాగుచేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

మంచి దిగుబడులకు అవకాశం:



పంటమార్పిడివల్ల రైతులు అధిక దిగుబడి సాధించవచ్చు. ప్రస్తుతం రైతులు అధికశాతం తమ పొలాల్లో ఏటా ఒకేరకం పంట సాగుచేస్తున్నారు. నీటి పారుదల కింద వరితప్ప ఇతర పంటలు సాగు చేయడంలేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీన్ని నివారించేందుకు పంట మార్పిడి విధానం ఉన్నతమైఐది. రైతులంతా తప్పనిసరిగా పంటమార్పిడి అమలు చేయాలి.

కంచం రాధ, ఏఓ

మొండిబకాయిదారులు వీరే..!

- కనిగిరి మున్సిపాలిటీలో ఫ్లెక్సీల రచ్చ
- ఇంటిపన్ను బకాయిదారుల పేరుతో ఫ్లెక్సీల ఏర్పాటు
- టాప్‌టెన్ జాబితాలో టీడీపీ నేతల పేర్లు
- మున్సిపాలిటీ నిర్ణయంతో పట్టణంలో జోరుగా చర్చ



పట్టణంలో ఏర్పాటు చేసిన ఇంటి పన్నుల మొండి బకాయిదారుల ఫ్లెక్సీ

కనిగిరి రూరల్: కనిగిరి మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తీసుకున్న సంచలన నిర్ణయం కనిగిరిలో తీవ్ర చర్చకు దారి తీసింది. రాత్రికి రాత్రి ఒక్కసారిగా ఇంటి పన్నులు చెల్లించని మొండిబకాయిదారులు వీరేనంటూ పది మంది పేర్లు, వారి ఇంటి, భవన సముదాయాల అసెస్‌మెంట్, డోర్ నంబర్లతో సహా వారి చెల్లించాల్సిన పన్ను నగదు ఇదేనంటూ వివరాలా ఫ్లెక్సీలో ముద్రించి పట్టణ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. గత నాలుగేళ్ల నుంచి ఇంటి పన్నులు కట్టని టాప్ టెన్ ప్రముఖులు వీరే నంటూ పట్టణానికి చెందిన కుందురు తిరుపతిరెడ్డి, పాలికిటి జయలక్ష్మి, సాయిబాబా టాకీస్, ఎస్‌కే జిలానీ, సూరా పాపిరెడ్డి, వెంకటేశ్వర థియేటర్, అరితోటి దావీదు, సానికొమ్ము వెంకట సుబ్బారెడ్డి, పైడిమర్రి వెంకట కృష్ణారావు, పఠాన్ మహమ్మద్ జిలానీబాషాల పేర్లు రాసి డోర్ నంబర్లు, చెల్లించాల్సిన ఇంటిపన్ను బకాయి మొత్తాన్ని ప్రచురించారు. ఈ పది మంది మొత్తం సుమారు రూ.29 లక్షల వరకు ఉన్నట్లు అందులో పేర్కొన్నారు.

కనిగిరిలో జోరుగా చర్చ..

ప్రస్తుతం ఇంటి పన్ను చెల్లించని వారిలో మొదటి పది మంది పట్టణంలో పేరున్న ప్రముఖులు, ఆర్థికవంతులు ఉన్నారు. అంతేగాక వారిలో ఎక్కువ మంది అధికార టీడీపీకి చెందిన వారు ఉండటంతో పట్టణంలో తీవ్ర చర్చకు దారి తీసింది. అంతేగాక ఫ్లెక్సీల ఏర్పాటు తర్వాత అయినా వారు స్పందించపోతే ప్రతి రోజు పట్టణంలో దండోరా వేసే ప్రక్రియ కూడా జరుగుతుందని మున్సిపల్ సిబ్బంది గుసుగుసలాడుకుంటున్నారు. వాస్తవానికి 2015 నుంచి మొండి పద్దుల బకాయి జాబితాలో పట్టణానికి చెందిన వారు చాలా మంది ఉన్నట్లు తెలిసింది. అయితే వీరిలో గత నాలుగేళ్ల నుంచి కనీసం స్పందించని వారిని టాప్ 100 మందిని మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది గుర్తించారు. వారిలో కూడా టాప్‌టెన్‌ను తీసుకుని రూ.లక్షకు పైగా ఉన్న వారిని తొలివిడతగా ఫ్లెక్సీల్లో ముద్రించారు. వీరి తర్వాత మరికొందరి మొండి పద్దులదారుల పేర్లు ముద్రణ జరుగుతుందనే ప్రచారం మున్సిపల్ శాఖలో జరుగుతోంది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపల్ కమిషనర్ ఒక్క సారిగా తీసుకున్న నిర్ణయంతో ప్రజల్లో పలు కోణాల్లో ప్రచారం సాగుతోంది.

మున్సిపల్ పన్ను ఇంటి డిమాండ్ ఇదే..

కనిగిరి మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో మొత్తం 9,623 అసెస్ మెంట్‌నంబర్లు ఉన్నాయి. దీనికి సంబంధించి ప్రతి ఏడాది రూ 4.65 కోట్లు పన్ను వసూలు డిమాండ్ ఉంది. అందుకు గాను 2024–2025 ఏడాదికి సబంధించి సుమారు రూ.3.25 కోట్ల వరకు వసూళ్ల జరిగినట్లు తెలిసింది. ఏటా ఏప్రిల్‌లోనే సుమారు రూ.కోటి వరకు పన్ను వసూలు జరుగుతాయి. అయితే ఈ ఏడాది సుమారు రూ.కోటికి పైగా పన్ను వసూళ్ల జరగలేదు. టాప్ టెన్ పన్ను బకాయిదారులకు వడ్డీ మాఫీ అవకాశం కల్పించినా స్పందించ లేదనేది సమాచారం. త్వరలో టాప్ 20 జాబితా ప్రచురణకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

భక్తిశ్రద్ధలతో తిరుమలనాథస్వామికి పూజలు



విశిష్ట అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథస్వామి మూలవిగ్రహమూర్తి

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పురాతన ఆలయం అయ్యలూరివారిపల్లెలోని శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథ స్వామి ఆలయంలో శనివారం విశిష్ట పూజలు చేశారు. ఈసందర్భంగా స్వామికి వేకువజామున అభిషేకం నిర్వహించారు. అదేవిధంగా శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు కుంకుమపూజ నిర్వహించారు. ఏటా మృగశిర నక్షత్రం వచ్చిన తరువాత మొదటి శనివారం రోజున ఆలయంలో విశిష్ట పూజలు నిర్వహించడం విశేషం. పూజల్లో భక్తులు పాల్గొనగా వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

టంగుటూరులో 64.4 మి.మీ వర్షపాతం నమోదు



టంగుటూరులో కురుస్తున్న వర్షం

టంగుటూరు: రుతుపవనాలు రాకతో రెండు మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. టంగుటూరు మండలంలో శనివారం అత్యధికంగా 64.4 మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. వర్షంతో వాగులు, వంకలు, ప్రధాన రహదారులు, గ్రామాల్లో వీధులన్నీ జలమయ య్యాయి. రైతులు వర్షం పడటంతో పచ్చి రొట్ట పంటలు, నూవులు సాగుకు సిద్ధమవుతున్నారు.

ఘనంగా సాయి ఆలయ వార్షికోత్సవం



జమ్ములపాలెంలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



జమ్ములపాలెంలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

- 251 కలశాలతో విశేష అభిషేకం

టంగుటూరు: జమ్ములపాలెం గ్రామంలో వేంచేసియున్న సాయిబాబా ఆలయ మొదటి వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు 251 కలశాల్లో మంచి నీటిని శివాలయం దగ్గర నుంచి మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అర్చకులు బాబాకి విశేష అభిషేకం నిర్వహించి, మండపారాధన పూజలు జరిపించారు. అనంతరం హోమాలు, మహా హారతి కార్యక్రమం నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ చేసి, రాత్రి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పనిబాట వద్దు.. బడిబాటే ముద్దు..



విద్య ఆవశ్యతపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కనిగిరి రూరల్: ×పనిబాట వద్దు.. బడిబాట ముద్దు¤ అనే నినాదంతో పట్టణంలోని పలువురు ఉపాధ్యాయులు శనివారం పట్టణ శివారు ప్రాంతాల్లో పర్యటించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం కలువ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యతోనే పేదరికం దూరమవుతుందని, చదువుతోనే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అమ్మఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు ప్రభుత్వం అంద చేస్తోందని, పాఠశాలలో ఉచిత పుస్తకాలు, నోటుబుక్‌లు, యూనిఫాం, బ్యాగులు, షూ వంటివి అందచేస్తారని వివరించారు. సర్కారు బడుల్లో నాణ్యమైన పోషక ఆహారం అందచేస్తారని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో మెరుగైన సౌకార్యాలు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు విధిగా బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. 14 ఏళ్ల లోపు పిల్లలందరూ పాఠశాలలో ఉండాలని వివరించారు. 14 ఏళ్ల లోపు పిల్లల్ని పనికి పంపించినా..పనిలో చేర్చుకున్నా చట్టరీత్యా నేరమన్నారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు టి.రమణారెడ్డి, రంగారెడ్డి, పరుసు సత్యగోపాల్(గోపి), ఎస్‌కే ఖాశిం, ఫిజికల్ డైరెక్టర్ పాశం సుశీల, రమాదేవి పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవస్వామి మూలవిరాట్

మార్కాపురం టౌన్: పట్టణంలో వెలసిన శ్రీ దేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం చెన్నకేశవస్వామి వారికి ప్రత్యేక పూజలు అర్చకులు నిర్వహించారు. శనివారం సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చన, ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. అలాగే శ్రీ ప్రసన్నవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలను అర్చకులు అరుణ్‌స్వామి నిర్వహించారు. శనివారం సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఆలయ చైర్మన్ కేశవరావు, ఈఓ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న ప్రసన్నవెంకటేశ్వరస్వామి

మాలకొండ ఆదాయం రూ.14,87,405

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.14,87,405 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.28,200, తలనీలాలు రూ.73,175, ప్రత్యేక దర్శనం రూ.3,90,500, లడ్డుప్రసాదాలు రూ.2,10,840, అన్నదానం రూ.5,26,129, రూమ్‌అద్దెలు రూ.32,620 వచ్చినట్లు పేర్కొన్నారు.

జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుడ్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ ఇంటర్ తరగతుల నిర్వహణకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఎంపీసీలో 40 సీట్లు, సీఈసీలో 40 సీట్లు మంజూరయ్యాయన్నారు. మండలంలోని నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు జూనియర్ ఇంటర్‌లో చేరడానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కొబ్బరికాయల విక్రయానికి వేలంపాట

పెద్దారవీడు: మండల పరిధిలోని రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీ గొట్లాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొబ్బరి కాయలు, కూల్‌డ్రింక్స్, ప్రసాదం అమ్ముకునేందుకు 10వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలంపాట ఆలయం ప్రాంగణంలో నిర్వహిస్తారని కార్యనిర్వాహణ అధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి శనివారం తెలిపారు. పాట పాడుకునే వారు ముందుగా రూ.10 వేలు చెల్లించి పాటలో పాల్గొనాలని, పూర్తి వివరాల కోసం 8099949996 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు అభయాంజనేయస్వామి ద్వితీయ వార్షికోత్సవం

పెద్దారవీడు: మండల పరిధిలోని ఎస్.కొత్తపల్లి గ్రామం సమీపం శ్రీ శివనాగ అభయాంజనేయస్వామి (నాగమయ్య పుట్ట) ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు ఆదివారం నిర్వహిస్తారని గ్రామస్తులు శనివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు గణపతి పూజ, అభిషేకాలు, ఆకు పూజ, కుంకుమార్చన, కలశ పూజ, తదితర పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తి పాటలతో భజన, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమం, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారని చెప్పారు.

డైరెక్టర్ పదవికి కోటయ్య గౌడ్ రాజీనామా

గిద్దలూరు రూరల్: కొత్త ప్రభుత్వం ఏర్పాటు సందర్భంగా గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి కోటయ్య గౌడ్ శనివారం రాజీనామా చేశారు. కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు రాజీనామాలు చేయాలని సీఎస్ నీరబ్‌కుమార్ సూచించడంతో కోటయ్యగౌడ్ తన రాజీనామాను ప్రభుత్వానికి పంపారు. నూతనంగా ఏర్పడబోయే ప్రభుత్వం బీసీలకు ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. బీసీల ఆత్మగౌరవం నిలబడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

పనిభారం పెంచే చార్టులను రద్దు చేయాలి

కందుకూరు: డ్రైవర్లపై పనిభారం పెంచే విధంగా ఆర్టీసీ అధికారులు విధుల చార్టులు రూపొందిస్తున్నారని, ఇటువంటి చార్టులను రద్దు చేయాలని ఆర్టీసీ ఎస్ఎంయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, టీఎన్‌టీయూసీ, వైఎస్సార్‌ఈపీ నాయకులు డిమాండ్ చేశారు. పనిభారం పెంచే విధంగా ఓవర్‌టైమ్ డ్యూటీలు, లింక్‌డ్యూటీలు వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని నెల్లూరు డీపీటీఓ దృష్టికి తీసుకెళ్లగా డిపో మేనేజర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారని, కానీ డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన చార్టులను ఆపే ప్రసక్తే లేదని, నూతన చార్టుల ప్రకారమే విధులు నిర్వహించాల్సి ఉంటుందని అధికారులు తేల్చి చెప్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని నూతనంగా ఎన్నికైన కొండపి, కందుకూరు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లామని, వారు సమస్యను పరిష్కరించాలని డిపో మేనేజర్‌కు సూచించినా పట్టించుకోవడం లేదని వివరించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు కలుగజేసుకుని డ్రైవర్లపై పనిభారం పెంచే చార్టులను రద్దు చేయాలని, లేకుంటే ఆందోళన చేపడతామన్నారు.